ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ సంపుటి: 18 సంచిక: 156 శుక్రవారం, 18 ఏప్రిల్ 2025 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com

# రేవంత్ రెడ్డి పిచ్చి సన్నాసి

- చెరువు తాకట్టు పెట్టుడు రేవంత్ తెలివితక్కువ తనానికి పరాకాష్ట
- రూ.10వేల కోట్ల కుంభకోణంలో మా మాటే వాస్తవమైంది
- హెచ్‌సీయూ భూములపై స్వతంత్ర దర్యాప్తు బృందం ఏర్పాటు కావాలి
- ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా సుప్రీంకోర్టు తీర్పు
- ఈ ప్రభుత్వాన్ని ప్రజలే తుంగలో తొక్కుతారు
- ఘాటు వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్ ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**

కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇలాంటి చేతకాని ప్రభుత్వం చరిత్రలో ఎప్పుడూ లేదన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో తిరోగమనం పట్టించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని, ఆ దిశగానే

మిగతా 2వ పేజీలో

## వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు స్టే


- వారం రోజుల్లో సమాధానం చెప్పాలి
- ఆస్తులను డీ నోటిఫై చేయొద్దు
- బోర్డులో నూతన నియామకాలు చేయొద్దు



02

## గ్రూప్-1 నియామక ప్రక్రియకు బ్రేకులు

- సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించండి
- కోర్టు తీర్పుతో ఆందోళనలో అభ్యర్థులు
- ఇప్పటి వరకు 20 పిటిషన్‌లు దాఖలు
- ఆది నుంచి వివాదాల్లో గ్రూప్1 పరీక్షలు
- కీలక ఆదేశాలిచ్చిన న్యాయస్థానం


02



## జపాన్‌లో రేవంత్ పెట్టుబడుల వేట

- పెట్టుబడులను ఆకర్షించడానికి వరుస చర్చలు
- సోనీ, క్రంచీరోల్ ప్రతినిధులతో సమావేశం
- హైదరాబాద్‌లోని అనుకూలతలను వివరించిన సీఎం
- 30వేల ఉద్యోగావకాశాలకు ఆస్కారం
- పెట్టుబడికి ఓకే చెప్పిన మారుబెనీ సంస్థ
- సంతోషం వ్యక్తం చేసిన సీఎం రేవంత్


02

## చారిత్రక కట్టడాలు జాగ్రత్త

- పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై హైకోర్టులో జరిగిన విచారణ
- కీలక ఆదేశాలు ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం
- ఏ కట్టడాన్ని కూల్చట్లేదని చెప్పిన న్యాయవాది
- మెట్రో ప్రాజెక్ట్‌కు కోర్టు గ్రీన్ సిగ్నల్


02


## రోల్‌మోడల్‌గా 'భూ భారతి' చట్టం

- ఇతర రాష్ట్రాలు కూడా క్యూ కడతాయి
- 'భూ భారతి' భలే అని దేశమే కోడైకూస్తుంది
- గతంలో ఎన్నో భూ వివాదాలు, సమస్యలు
- వాటన్నింటికి ఒకటే పరిష్కారం 'భూ భారతి'
- రెవెన్యూ సదస్సులో మాట్లాడిన మంత్రి పొంగులేటి


02

## ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ కక్షాపూరిత రాజకీయాలు.

- కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్నందుకే కుట్ర.
- టీపీసీసీ ధర్నాలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.


02

## తెలంగాణలో చేవచచ్చిన ప్రభుత్వం

- మన నీటిని ఏపీ దోచుకుంటుంటే శిలావిగ్రహంలో ఉన్న సర్కార్
- నీళ్లు నములుతున్న నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రోజు రోజుకు
- పెరుగుతున్న జలదోపిడీ
- ఇప్పటికయినా సర్కార్ మేలుకోవాలి
- ఘాటు వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి హరీష్ రావు


02

# రేవంత్ రెడ్డి పిచ్చి సన్నాసి..

మొదటిపేజి తరువాయి

సీఎం, మంత్రులు అంతా ఆ దిశగానే అడుగులు వేస్తున్నారంటూ చురకలంటించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగానే కాంగ్రెస్ పార్టీని తూర్పారబట్టారు. ఒక్కటంటే ఒక్క రంగంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి జరగలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఛీ కొడుతున్నారని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని వాళ్లు కలలు కంటున్నారని, బీఆర్ఎస్‌కు అంత ఖర్మ పట్టలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

హెచ్‌సీయూ భూముల విషయంలో భారీగా అవకతవకలు జరిగాయని, రేవంత్ రెడ్డి రూ. 10వేల కోట్ల కుంభకోణానికి ప్రణాళికలు రచిస్తున్నారని తాము చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు వాస్తవాలని తేలిందని కేటీఆర్ వివరించారు. "సుప్రీం కోర్టు సాధికార కమిటీ హెచ్‌సీయూ భూములపై ఆర్థిక పరమైన అవకతవకలు, ఉద్దేశపూర్వకంగా చేసిన అరాచక పర్వంపై స్పెషలైజ్డ్ ఏజెన్సీ ద్వారా స్వతంత్ర దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. ఈ రూ.10 వేల కోట్ల కుంభకోణం బయటకు రావాలంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆర్బీఐ కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'బుధవారం నాటి సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా ఉన్నాయి. అధికార మదంతో విర్రవీగుతూ.. మేమే నియంతలం, రారాజులం అని అనుకుంటున్న వారికి నిన్నటి సుప్రీం కోర్టు తీర్పు ఒక గుణ పాఠం" అని వ్యాఖ్యానించారు.



**రేవంత్ ఓ పిరికి సన్నాసి**

"రేవంత్ రెడ్డి ఓ పిరికి సన్నాసి. దర్శనం వెంకటయ్య అనే ఒక దళిత వృద్ధున్ని తీసుకుపోయి జైల్లో పెట్టించాడు. సోషల్ మీడియా కంటే ఎక్కువగా క్షేత్రస్థాయిలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉంది. ప్రజలు విమర్శిస్తే ఫీడ్ బ్యాక్ లాగా తీసుకోవాలి. అదే ప్రజాస్వామిక స్ఫూర్తి" అని కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ పడగొట్టాల్సిన అవసరం లేదు. ప్రజల్లోనే తిరుగుబాటు వచ్చి కూలిపోతుంది. రేవంత్ రెడ్డి చేస్తున్న లుచ్చా పనులకు ప్రజలే బుద్ధి చెప్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండాలి. రేవంత్ రెడ్డినే ముఖ్యమంత్రిగా ఉండాలి. అలా అయితే మరో 20 ఏళ్ల వరకు ఎవరు కాంగ్రెస్‌కు ఓటు వేయరు" అని వ్యాఖ్యానించారు.

**ఇంకొకరైతే రాజీనామా చేసేవాళ్లు**

"సుప్రీంకోర్టు ఆదేశాలతో వేరే ముఖ్యమంత్రి అయితే రాజీనామా చేసేవాడు. కానీ రేవంత్ రెడ్డికి సిగ్గు లేదు కాబట్టి దులుపుకొని పోతున్నడు. హెచ్‌సీయూ భూముల కోసం పోరాడిన విద్యార్థులు, సామాజికవేత్తలకు అభినందనలు. సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి హృదయపూర్వక ధన్యవాదాలు. కంచగచ్చిబౌలి భూమి వర్సిటీ ఆధీనంలో ఉన్నదని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సాధికార కమిటీ చెప్పింది. ఆ భూములపై సుప్రీం కోర్టు చొరవ తీసుకోవాలని సూచించింది. 10 వేల కోట్ల కుంభకోణం బయటకు రావాలంటే పూర్తిస్థాయి విచారణ జరగాలి. ప్రధాని మోదీ ఒక్కోచోట ఒక్కోరకంగా మాట్లాడుతారు. రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ నడుస్తున్నదని అన్నారు. కానీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. సెంట్రల్ వర్సిటీ భూముల్లోకి ప్రభుత్వం బుల్డోజర్లను పంపి విధ్వంసం సృష్టిస్తున్నదని మోదీ చెప్పారు. హెచ్‌సీయూ భూములపై రేవంత్ రెడ్డి చేసిన కుంభకోణంపై మోదీ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు?. సుప్రీంకోర్టు నియమించిన సాధికార కమిటీ హెచ్‌సీయూ భూములపై కుంభకోణం జరిగిందని, విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని నిన్న నివేదిక ఇచ్చింది" అని తెలిపారు.

**మోడీకి లేఖ రాశాం..**

"ఈ కుంభకోణంపై మా పార్టీ తరపున అన్ని ఆధారాలతో సహా లేఖ రాశాం. మోదీకి చిత్తశుద్ధి ఉంటే ఈ కుంభకోణంపై విచారణకు ఆదేశించాలి. లేదంటే మోడీ ప్రభుత్వం మాటల ప్రభుత్వమని మేమే కాదు తెలంగాణ ప్రజలు కూడా అనుకుంటారు. కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి. ప్రభుత్వ ఉత్తర్వులను టీజీఐఐసీ తుంగలో తొక్కిందని సాధికార కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. చెరువలను కూడా తనఖా పెట్టారని నివేదికలో పేర్కొంది. రేవంత్ రెడ్డి లాంటి పిచ్చి సన్నాసి తప్ప చెరువును ఎవడు తాకట్టు పెట్టడు. రేవంత్ ప్రభుత్వాన్ని కాపాడేందుకు బీజేపీ నేతలు ఎందుకు ప్రయత్నిస్తున్నారు. వన్యప్రాణులు చనిపోయాయంటే ఏఐ వీడియోలంటూ కేసులు పెట్టారు. రేవంత్‌రెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తున్న అధికారులు, పోలీసుపై సుప్రీంకోర్టుకు వెళ్తాం. కంచ గచ్చిబౌలి భూములపై కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. ఆర్థిక దోపిడీ, పర్యావరణపై దాడి విషయంలో ప్రధాని మోదీ స్పందించాలి. చిత్తశుద్ధి ఉంటే రేవంత్ రెడ్డి బయటకు వచ్చి మాట్లాడాలి" అని కోరారు. అనంతరం పార్టీ ఫిరాయింపులపై కూడా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

అసలు పార్టీ ఫిరాయింపులు అన్న సంస్కృతికి పురుడు పోసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ హయాంలో ఫిరాయింపుల సంస్కృతి మొదలైందని అన్నారు. "ఈ దేశంలో ఆయా రామ్.. గయా రామ్ ఫిరాయింపుల సంస్కృతిని తీసుకువచ్చింది హర్యానాలో నాటి ఇందిరా గాంధీ. 2004లో కాంగ్రెస్ పార్టీతో కలిసి మేం పోటీ చేశాం. 26 మంది ఎమ్మెల్యేలు మా పార్టీ తరపున గెలిస్తే అందులో పది మందిని కాంగ్రెస్ పార్టీ గుంజుకుంది. తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల సంస్కృతికి బీజం వేసింది కాంగ్రెస్. మొన్నటికి మొన్న మా ఎమ్మెల్యేలను కూడా కాంగ్రెస్ గుంజుకుంది" అని కేటీఆర్ తెలిపారు.

# తెలంగాణలో చేవచచ్చిన ప్రభుత్వం

- మన నీటిని ఏపీ దోచుకుంటుంటే శిలావిగ్రహంలో ఉన్న సర్కార్
- నీళ్లు నములుతున్న నీళ్ల మంత్రి
- రోజు రోజుకు పెరుగుతున్న జలదోపిడీ
- ఇప్పటికయినా సర్కార్ మేలుకోవాలి
- ఘాటు వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్ ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర సాగునీరు, తాగు నీటికి ఏపీ దోచేస్తుంటే ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం మిన్నుకుండిపోయిందంటూ మాజీ మంత్రి మంత్రి హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ నీటిని ఏపీ కాజేస్తుంటే బెల్లం కొట్టి రాళ్లలో నిలబడం కాకుండా సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఏం చేశారని నిలదీశారు. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంతటి నష్టం జరుగుతుందో ఇవాళ కళ్ల ముందు కనబడుతున్నదని ఎద్దేవా చేశారు. "తెలంగాణ సాగర్ కుడి కాల్వ నుంచి ఏపీ ప్రభుత్వం రోజు 10వేల క్యూసెక్కుల నీళ్లు తరలించుకుపోతుంటే, తెలంగాణ ప్రభుత్వం చేవచచ్చి, చేష్టలుడిగి చేతులు కట్టుకొని చూస్తున్నారు. నీళ్ల మంత్రి నీళ్లు నములుతున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలంగాణ భూభాగానికి నీళ్లు మళ్లించిన ప్రభుత్వం బీఆర్ఎస్ అయితే, చేతగాక నీళ్లు నములుతున్న ప్రభుత్వం కాంగ్రెస్‌ది" అని విమర్శించారు. "కృష్ణా జలాల్లో ఏపీ తాత్కాలిక వాటా 512 టిఎంసీలు, కానీ ఇప్పటి వరకు 657 టీఎంసీలు తరలిస్తే మీ నోరు పెగలదా? మిమ్మల్ని ఎన్నుకున్నది ఎందుకు? గడిచిన 25 రోజుల్లోనే 60 టిఎంసీలు తరలించారు. అంటే రోజుకు రెండు టిఎంసీలు" అని లెక్కలు చెప్పారు హరీష్ రావు.

"తెలంగాణ నీటి ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్, తెలంగాణ ప్రజల పాలిట పెను శాపం. సీఆర్పీఎఫ్ బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆనాడు అసెంబ్లీలో తీర్మానం చేసినం. నాగార్జున సాగర్ ను తెలంగాణ ఆధీనంలోకి తీసుకోవాలని కోరినం. నవంబర్ 30, 2023 నాడు ఏ స్టేటస్ లో ఉందో, అదే స్టేటస్ ఉండాలని తీర్మానం చేసినం. ఏడాది నుంచి చేతుల్లోకి తీసుకోవడంలో కాంగ్రెస్ ఫెయిల్. మన చేతిలో ఉండే కుడి కాల్వ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులు ఏపీ తీసుకుపోరు కదా. మీ చేతగానితనం, నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు పెద్ద దెబ్బ తగిలే ప్రమాదం ఉన్నది. చంద్రబాబును అడిగే ధైర్యం లేదు. కేంద్రం ను అడిగే దమ్ము లేదు. ఎగురుమంటే విపక్షం మీద వికారపు భాషలో జానెడు జానెడు ఎగురుతావు" అంటూ చురకలంటించారు.

"ఎగరాల్సిన చోట ఎగరటం చేతనైతలేదు. తెలంగాణ సాగు నీటి, తాగు నీటి అవసరాలకు నిల్వ ఉంచాల్సిన నీటిని ఏపీ తరలిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు. ఈ ఏడాదికి కృష్ణాలో 1010 టీఎంసీల నీళ్లు వచ్చాయి. తాత్కాలిక ఒప్పంద ప్రకారం అనుకున్నా ఏపీ 666 టీఎంసీలు రావాలి. కానీ ఏపీ ఇప్పటికే 657 టిఎంసీలు వాడింది. ఏపీకి మిగిలిన హక్కు కేవలం 9 టీఎంసీలే. ఇవ్వాళ కూడా సాగర్ కుడి కాల్వలో 10వేల క్యుసెక్కులు పోతున్నయి. తెలంగాణకు ఆ రేషియో ప్రకారం చూసిన 343 టీఎంసీల నీళ్లు తెలంగాణకు రావాలి. ఈరోజుకు తెలంగాణ వాడుకున్నది ఎంత అంటే 220 టీఎంసీ మాత్రమే. ఇంకా తెలంగాణకు 123 టీఎంసీలు రావాలి. 123 మరియు 9 టీఎంసీలు కలిపితే 132టీఎంసీ. శ్రీశైలం, సాగర్ లో కలిసి ఉన్న నీళ్లు 100 టీఎంసీలు. ఈ వందలో ఏపీ తరలిస్తూ ఉన్నది. తెలంగాణ నష్టపోతున్నది. కాంగ్రెస్ గుడ్లు అప్పగించి చూస్తున్నది. ఏపీ నుంచి తెచ్చుకున్న మీ అడ్వైజర్ ఏం చేస్తున్నడు. ఇంజినీర్లు ఏం చేస్తున్నరు. నీటి పారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నడు. నాగార్జున సాగర్ ఎండీడీఎల్ 510, ఈరోజు ఉన్నది 50 టీఎంసీలు. శ్రీశైలం ఎండీడీఎల్ 834, ఈరోజు ఉన్నది 50టీఎంసీలు. రెండు కలిపి మొత్తం 100 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నయి. ఉన్నయి తక్కువ తెలంగాణకు రావాల్సింది ఎక్కువ. ఇప్పటికైనా కళ్లు తెరవండి. అన్యాయం అడ్డుకోండి" అని కోరారు.



# రోల్‌మోడల్‌గా 'భూ భారతి' చట్టం

- ఇతర రాష్ట్రాలు కూడా క్యూ కడతాయి
- 'భూ భారతి' భలే అని దేశమే కోడైకూస్తుంది
- గతంలో ఎన్నో భూ వివాదాలు, సమస్యలు
- వాటన్నింటికి ఒకటే పరిష్కారం 'భూ భారతి'
- రెవెన్యూ సదస్సులో మాట్లాడిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్ ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**

తెలంగాణను భూవివాద రహిత రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని, అందుకోసమే 'భూభారతి' చట్టాన్ని తెచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. తమ ప్రభుత్వం తెచ్చిన 'భూ భారతి' చట్టం దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అతి త్వరలోనే ఇతర రాష్ట్రాలు కూడా ఇటువంటి వ్యవస్థ కోసం తెలంగాణ చెంతకు వస్తాయని వ్యాఖ్యానించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజీపూర్‌లో 'భూభారతి'పై ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు.

"ధరణి లోపాలను సరిదిద్దాలని మాజీ మంత్రులు కోరుతున్నారు. వివరాలు తప్పుగా నమోదయ్యాయని చెబుతున్నారు. భూభారతి బిల్లు అసెంబ్లీలో పెడితే మాత్రం అడ్డుకునే ప్రయత్నం చేశారు. పేదలకు అండగా ఉండేందుకు ఈ చట్టం తీసుకువచ్చాం. భూభారతి చట్టం దేశంలోనే రోల్‌మోడల్ కాబోతోంది. ధరణి అమలులో ఉన్నప్పుడు అధికారుల వద్దకే ప్రజలు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారు. ఒక్క రూపాయి లేకుండా దరఖాస్తుచేసే అవకాశం వచ్చింది. పేదలకు చెందిన వేల ఎకరాలను గత ప్రభుత్వం కొల్లగొట్టింది. గతంలో కొల్లగొట్టిన భూములపై ఆడిట్ చేసి పేదలకు పంచుతాం. అసైన్డ్ భూముల్లో సాగు చేసుకుంటున్న అర్హులైన పేదలకు ఇస్తాం. కోర్టులో లేని భూముల సమస్యలను భూభారతి ద్వారా పరిష్కరిస్తాం. గతంలో పాసు పుస్తకం ప్రకారం కాకుండా భూమి ఎక్కువో.. తక్కువో ఉండేది" అని పొంగులేటి అన్నారు.

# గ్రూప్1 నియామక ప్రక్రియకు బ్రేకులు

- సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించండి
- కోర్టు తీర్పుతో ఆందోళనలో అభ్యర్థులు
- ఇప్పటి వరకు 20 పిటిషన్‌లు దాఖలు
- ఆది నుంచి వివాదాల్లో గ్రూప్-1 పరీక్షలు
- కీలక ఆదేశాలిచ్చిన న్యాయస్థానం

**హైదరాబాద్ ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**

గ్రూప్ 1 పరీక్షలు ప్రథమం నుంచి కూడా తీవ్ర వివాదాల్లోనే సాగుతున్నాయి. తొలుత పరీక్షల నిర్వహణపై వివాదం జరిగి కోర్టుకు వరకు వెళ్లింది. ఇప్పుడు పరీక్షల ఫలితాలు కూడా వివాదంలో చిక్కుకున్నాయి. ఈ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అంతేకాకుండా మరికొందరు గ్రూప్ 1 ప్రశ్నపత్రం లీక్ అయిందని, తెలుగు మీడియం అభ్యర్థుల మార్కుల మూల్యాకనంలో అవకతవకలు జరిగాయని, రెడ్డి సామాజిక వర్గం వారికే గ్రూప్ 1 ఫలితాల్లో పట్టం కట్టారని ఇలా అనేక ఆరోపణలు చేస్తూ న్యాయస్థానంలో పిటిషన్‌లు దాఖలు చేశారు. గ్రూప్ 1 పరీక్షల మూల్యాకనంపై దాఖలైన పిటిషన్ విచారణలో భాగంగా ఈ వ్యవహారం తేలేవరకు గ్రూప్ 1 అభ్యర్థుల నియామక ప్రక్రియను ఆపాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. విచారణ పూర్తయ్యే వరకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వొద్దని ఆదేశించింది. అయితే, ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

అయితే సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కొనసాగించవచ్చని హైకోర్టు తెలిపింది. పోస్టింగ్ లు మాత్రం తుది తీర్పు వెలువడే వరకూ ఇవ్వొద్దని క్లియర్ గా స్పష్టం చేసింది. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1 పరీక్ష ప్రశ్నాపత్రం లీకవడంతో రద్దయింది. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్ 1 పరీక్షను మళ్లీ నిర్వహించింది. అయితే పరీక్షను వాయిదా వేయాలని కొందరు అభ్యర్థులు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా పరీక్ష నిర్వహించింది. దీనిపై సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఫలితాలు విడుదల చేయడానికి ఎటువంటి ఆటంకం ఏర్పడలేదు. అయితే గ్రూప్ 1 పరీక్షల్లో అవతవకలు జరిగాయని పలు పిటిషన్లు దాఖలు కావడంతో నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది. యథావిధిగా సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకోవచ్చని, కాకపోతే తుది తీర్పు ఇచ్చే వరకూ పోస్టింగ్‌లు ఇవ్వొద్దని హైకోర్టు తన ఆదేశాల్లో పేర్కొదది. దాంతో తమ నియామకాల కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్న అభ్యర్థుల్లో నిరాశ అలముకుంది. మళ్లీ గ్రూప్ 1 పరిస్థితి ఇలా టర్న్ తీసుకుందేమిటని అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

# జపాన్‌లో రేవంత్ పెట్టుబడుల వేట

- పెట్టుబడులను ఆకర్షించడానికి వరుస చర్చలు
- సోనీ, క్రంచీరోల్ ప్రతినిధులతో సమావేశం
- హైదరాబాద్‌లోని అనుకూలతలను వివరించిన సీఎం
- 30వేల ఉద్యోగావకాశాలకు ఆస్కారం
- పెట్టుబడికి ఓకే చెప్పిన మారుబెనీ సంస్థ
- సంతోషం వ్యక్తం చేసిన సీఎం రేవంత్


**హైదరాబాద్ ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి జపాన్‌లో పర్యటిస్తున్నారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందానికి జపాన్‌లో ఘనస్వాగతం లభించింది. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణకు భారీమొత్తంలో పెట్టుబడులు తీసుకురావడానికి సీఎం రేవంత్, ఆయన బృందం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే వరుస సమావేశాల్లో పాల్గొంటోంది. జపాన్ చేరుకున్న తెలంగాణ రైజింగ్ బృందాన్ని ఆ దేశంలోని భారత రాయబారి శిబు జార్జ్ స్వాగతించారు. అనంతరం సీఎం రేవంత్, శిబు పలు అంశాలపై చర్చించారు. ఆ తర్వాత తన పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి అక్కడి సోనీ సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సోని కంపెనీ యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచైరోల్ బృందాన్ని కలిసి చర్చలు జరిపారు. ప్రముఖ జపాన్ కంపెనీ మారుబెనీ ప్రతినిధుల బృందం టోక్యోలో సీఎంతో భేటీ అయ్యింది. ఫ్యూచర్‌సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుపై చర్చించారు.

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు మరుబెనీ సంసిద్ధమైంది. టోక్యోలో మరుబెనీ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ కలిసి ఫ్యూచర్ సిటీలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, పెట్టుబడులపై చర్చించారు. మరుబెనీ రూ.1,000 కోట్ల ప్రారంభ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఫ్యూచర్ సిటీలో 600 ఎకరాల్లో దశలవారీగా ప్రపంచ స్థాయి నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. ఈ ఒప్పందానికి సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సీఎం సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, మరుబెనీ ప్రతినిధులు సంతకాలు చేశారు.

జపాన్, ఇతర మల్టీనేషనల్ కంపెనీలు హైదరాబాద్‌లో తమ తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తారు. దీని ద్వారా రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అంచనా ఉంది. మరుబెనీ ఇండస్ట్రియల్ పార్క్ ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఫార్మా, ప్రెసిషన్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై దృష్టి సారిస్తుంది. అధునాతన తయారీ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు నైపుణ్య ఉపాధి అవకాశాలను సృష్టించాలనే తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు చేపడుతారు. చర్చల సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీలో మరుబెనీకి స్వాగతం పలికారు. ఈ పార్క్ ఫ్యూచర్ సిటీలో అభివృద్ధి చేసే తొలి ప్రాజెక్ట్ అవుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా తెలంగాణలో సుమారు 30,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు సృష్టించబడి, జీవనోపాధి మెరుగుపడుతుందని తెలిపారు. "తెలంగాణలో వ్యాపారానికి అనుకూలమైన అవకాశాలున్నాయి. మరుబెనీకి అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుంది. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ భారతదేశంలోనే తొలి నెట్ జీరో సిటీగా అభివృద్ధి చెందుతుంది. మరుబెనీ పెట్టుబడులకు ముందుకొచ్చినందుకు సంతోషంగా ఉంది. భారత్‌జపాన్ స్నేహ బంధం దృష్ట్యా పెట్టుబడిదారులు తెలంగాణను స్వస్థలంగా భావిస్తారని కోరుకుంటున్నాను" అని అన్నారు.

ఈ పర్యటనలో భాగంగా సోనీ కంపెనీకి చెందిన యానిమేషన్ అనుబంధ సంస్థ క్రంచీరోల్ బృందంతో కూడా రేవంత్ చర్చలు జరిపారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్ , గేమింగ్ రంగాలలో పెట్టుబడుల విస్తరణకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలు, అనుకూలతలను తెలంగాణ బృందం కంపెనీ ప్రతినిధులకు వివరించింది. ఎండ్‌టుఎండ్ ప్రొడక్షన్ సామర్థ్యాన్ని కలిగి ఉండే అత్యాధునిక ఫిల్మ్ సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సీఎం రేవంత్ తమ ఫ్యూచర్ విజన్‌ను వారితో పంచుకున్నారు.



# చారిత్రక కట్టడాలు జాగ్రత్త

- పాతబస్తీలో మెట్రో నిర్మాణంపై హైకోర్టులో జరిగిన విచారణ
- కీలక ఆదేశాలు ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం
- ఏ కట్టడాన్ని కూల్చట్లేదని చెప్పిన న్యాయవాది
- మెట్రో ప్రాజెక్ట్‌కు కోర్టు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్ ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**

మెట్రో విస్తరణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాతబస్తీ గుండా ప్రాజెక్ట్ చేపట్టొచ్చని తెలిపింది. కానీ మెట్రో పనుల కారణంగా ఆ మార్గంలో ఉన్న ఏ చారిత్రక కట్టడానికి కూడా ఎటువంటి నష్టం జరగకూడదని, ఆ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మూడో దశ మెట్రో విస్తరణ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రణాళికలను కూడా సిద్ధం చేసింది. కాగా ఈ మెట్రో నిర్మాణ పనులపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఒకటి దాఖలైంది. యాక్ట్ ఫర్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఈ పిల్ వేసింది. మెట్రో విస్తరణ కోసం సిద్ధం చేసిన రూట్ మ్యాప్‌లో పలు చారిత్రక కట్టడాలు ఉన్నాయని, మెట్రో పనుల కారణంగా వాటికి నష్టం జరగొచ్చని పిల్ పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గురువారం కీలక ఆదేశాలు ఇచ్చింది.

ఈ విచారణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏఏజీ వాదనలు వినిపించారు. పురావస్తుశాఖ గర్తించిన చారిత్రక కట్టడాలకు నష్టం లేకుండా చూస్తున్నామని ఈ సందర్భంగా ఏఏజీ కోర్టుకు తెలిపారు. చారిత్రక కట్టడాలను కూలగొట్టడం లేదని చెప్పారు. పరిహారం చెల్లించాకే స్థలాలు సేకరించి నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయడానికి ఏఏజీ సమయం కోరారు. ఆయన అభ్యర్థనకు ధర్మాసనం స్పందిస్తూ.. మెట్రో నిర్మాణ పనుల్లో భాగంగా చారిత్రక కట్టడాలకు ఎలాంటి నష్టం చేయకూడదని సూచించింది. పురావస్తుశాఖ గుర్తించిన చారిత్రక కట్టడాల వద్ద ఎలాంటి పనులు చేపట్టకూడదని ఆదేశించింది. ఈ నెల 22 లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం.. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 22కి వాయిదా వేసింది.

# ప్రజల దృష్టి మరల్చేందుకే బీజేపీ కక్షాపూరిత రాజకీయాలు

- కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్నందుకే కుట్ర.
- టీపీసీసీ ధర్నాలో రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు.

**మంథని,పెద్దపల్లి,ఏప్రిల్17(ప్రజాస్వరం)**

తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే భారతీయ జనతా పార్టీ(బీజేపీ) కక్షాపూరిత రాజకీయాలకు పాల్పడుతోందని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ,రాహుల్ గాంధీ పేర్లను ఛార్జ్ షీట్ లో చేర్చడాన్ని నిరసిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఈడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు.12 ఏళ్ల కిందటి కేసును ఇప్పుడు తెరపైకి తీసుకురావడం వెనుకున్న ఆంతర్యమేంటని ప్రశ్నించారు.దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న ధరల పెరుగుదల,అంతర్జాతీయ స్థాయిలో తగ్గుతున్న రూపాయి విలువ,నిరుద్యోగం తదితర సమస్యలపై నిలదీస్తున్నందుకే కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను బీజేపీ టార్గెట్ చేసిందన్నారు.స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను పణంగా పెట్టిన గాంధీ కుటుంబంపై రాజకీయ దురుద్దేశంతోనే తప్పుడు కేసులు పెట్టారన్నారు.పార్టీ ఆత్మస్థైర్యం దెబ్బ తీసేలా రాజకీయ ప్రతీకార చర్యలకు పాల్పడుతుందన్నారు.కక్షాపూరిత రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఎన్ని కేసులు పెట్టినా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.




# వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు స్టే

**నేషనల్‌బ్యూరో ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**

కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం తీవ్ర దుమారం రేపింది. దీనిని ముస్లిం నేతలు, విపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ముస్లింలను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతోనే ఈ చట్టాన్ని తెచ్చారని కూడా పలువురు ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఈ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ఏకంగా 73 పిటీషన్లు దాఖలయ్యాయి. అటు కేంద్ర ప్రభుత్వం కూడా దీనిపై కేవియట్ పిటీషన్ దాఖలు చేసింది. సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవి విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటీషన్లపై విచారణ జరిపింది. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్లపై నిన్న అంటే ఏప్రిల్ 16న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సుదీర్ఘకాలంగా ముస్లిం సంబంధిత కార్యక్రమాలకు వినియోగిస్తున్న వక్ఫ్ బై యూజర్ ఆస్తుల్నిడీ నోటిఫై చేస్తే పలు సమస్యలు తలెత్తుతాయని సుప్రీంకోర్టు తెలిపింది. వక్ఫ్ బై యూజర్ ఆస్తులు దుర్వినియోగమయ్యాయనేది వాస్తవమే అయినా అనేక ముస్లిం ధార్మిక కార్యక్రమాలకు కూడా వాడుతున్నారని కోర్టు తెలిపింది. హిందూవుల ఆస్తులు హిందూవులే నిర్వహిస్తున్నారు కదా అని ప్రశ్నించింది. విచారణను ఇవాళ్టికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం కీలకమైన ఉత్తర్వులు జారీ చేసింది. వక్ఫ్ ఆస్తులు, నియామకాలై సుప్రీంకోర్టు స్టేటస్ కో విధించి మే 5వ తేదీకు విచారణ వాయిదా వేసింది. తదుపరి విచారణ పూర్తయ్యే వరకూ వక్ఫ్ ఆస్తుల్ని డీ నోటిఫై చేయకూడదని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వక్ఫ్ బోర్డులో కొత్త నియామకాలు చేపట్టవద్దని, ముస్లిమేతరుల్ని సభ్యులుగా నియమించవద్దని కోర్టు స్పష్టం చేసింది. పిటీషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై వారం రోజుల్లో వివరంగా సమధానం ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది. వక్ఫ్ ఆస్తుల్ని డీ నోటిఫై చేయవద్దని సూచించింది.



## కులాంతర వివాహ ప్రోత్సాహక బహుమతిని అందజేసిన జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్.

**జోగులాంబ గద్వాల,ఏప్రిల్ 17(ప్రజాస్వరం):** కులాంతర వివాహం చేసుకున్న జంటకు ఐడీఓసీకార్యాలయంలోనితనఛాంబర్‌నందుఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోప్రోత్సాహక బహుమతి ని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్‌మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.గద్వాల పట్టణానికి చెందిన శ్రీమతి టి.యం. మౌనిక (వైఫ్ ఆఫ్ కె.రమేష్) ఎస్సీ కులాంతర వివాహం చేసుకున్నందుకు, ప్రభుత్వ కల్పించిన పథకం ద్వారా రూ.2,50,000 ప్రోత్సాహక బహుమతిని మంజూరైనట్టు తెలిపారు.ఈ మొత్తాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జంటకు బాండ్‌ను అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి సరోజ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బింగిదొడ్డి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీ కి అవమానం

- **ఫ్లెక్సీ పై పేడ కొట్టిన దుండగులు**
- **దుండగులను శిక్షించాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బింగిదొడ్డి గ్రామస్తులు**

**అయిజ,ఏప్రిల్ 17(ప్రజాస్వరం):** జోగులాంబ గద్వాల జిల్లా,ఐజ మండల పరిధిలో ని బింగి దొడ్డి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీ కి అవమానం జరిగింది. వివరాలలోకి వెళ్తే బింగి దొడ్డి గ్రామంలోని యువకులు కొంతమంది పోలీసుల సమక్షంలో బుధవారం సాయంత్రం గ్రామంలోని పాఠశాల దగ్గర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.ఏర్పాటు చేస్తున్న క్రమంలో యువకులు జై భీమ్ జై భీమ్ అని నినాదాలు చేస్తుండగా అక్కడే ఉన్న కొంతమంది వ్యక్తులు జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.అప్పుడే అక్కడ కొంత ఘర్షణ వాతావరణం నెలకొన్నట్లు గ్రామ యువకులు తెలిపారు.బుధవారం రాత్రి కొంతమంది వ్యక్తులు ఫ్లెక్సీ పై పేడ కొట్టి అవమాణపరిచారు.ఈ సందర్భంగా గురువారం బింగి దొడ్డి గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ఐజ పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని అవమానపరిచిన వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ కార్యక్రమంలో బింగిదొడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కృషి.

- **విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కృషి.**
- **పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
- **అంతర్గాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.**

**అంతర్గాం,పెద్దపల్లి,ఏప్రిల్17 (ప్రజాస్వరం):** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్య బోధన అందించేందుకు కృషి చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను,పాఠశాలలో టాయిలెట్స్,కిచెన్ షెడ్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని అన్నారు.పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన పద్ధతులలో విద్యా బోధన జరగాలని,పాఠ్యాంశాలు సులువుగా అర్థం చేసుకునేలా వినూత్నంగా బోధించాలని కలెక్టర్ సూచించారు.పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని టాయిలెట్స్ రెగ్యులర్ గా క్లీన్ గా ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు ఉండే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట నాగార్జున,సంబంధిత సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 30 లోపు టెట్ పరీక్ష కోసం ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలి.

**పెద్దపల్లి జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి.**

**పెద్దపల్లి,ఏప్రిల్17(ప్రజాస్వరం):** ఏప్రిల్ 30 లోపు టెట్ పరీక్ష కోసం ఆసక్తి గల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాల విద్యాశాఖ సంచాలకులు తెలిపిన ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజి టెట్ 2025) కు హాజరగు అభ్యర్థులు ఏప్రిల్ 30 లోపు https://tgtet.aptonline.in/tgtet/ వెబ్ సైట్ నందు ఆన్



లైన్ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూ భారతి చట్టం రూపకల్పన.

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

- పెండింగ్ లో ఉన్న సాదా బైనమా దరఖాస్తులకు మోక్షం.
- వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్ కు భూమి పట్ట తప్పనిసరి.
- 30 రోజులలో భూమి మ్యూటేషన్ దరఖాస్తుల పరిష్కారం.
- ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారి ఏర్పాటుకు చర్యలు.
- మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక.
- భూ భారతి చట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఏర్పాటు.
- అంతర్గాం మండలంలోని బ్రాహ్మణ పల్లి రైతు వేదిక వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్.

**అంతర్గాం,పెద్దపల్లి,ఏప్రిల్17(ప్రజాస్వరం):**

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం రూపకల్పన చేసిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం అంతర్గాం మండలంలోని బ్రాహ్మణ పల్లి రైతు వేదిక వద్ద నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి పాల్గొన్నారు.భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు,ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్)చట్టం 2025 అమల్లోకి వచ్చిందని,ముందుగా రాష్ట్రంలోని 4 మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని,ఈ చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు పెద్దపల్లి జిల్లాలో ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 28 వరకు ప్రతి మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు.భూ భారతి చట్టం ప్రకారం ఏ సమస్యను ఎవరు ఎన్ని రోజులలో పరిష్కరించాలి అది పరిష్కారం కాకుంటే ఎలా అప్పీల్ కు వెళ్లాలని దానిపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేసిందని,సీసీఎల్ఏ కు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారి కలెక్టర్ కు అధికారాలను అప్పగించిందని అన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని,రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం పై కలెక్టర్ వద్ద,కలెక్టర్ నిర్ణయం పై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని,గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని,నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు.అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్ళవచ్చని,దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.ప్రతి గ్రామంలో



రెవెన్యూ రికార్డుల తయారు చేసి,ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు.రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని,దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు.ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని తెలిపారు.భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు మన జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలని,ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి,జిల్లా కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని,దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్,భూమి ట్రిబ్యునల్ లో అప్పీల్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.భూ భారతి పోర్టల్ లో ఎకరం భూమి మ్యూటేషన్ కోసం 2500 రూపాయల ఫీజు చెల్లించాలని,దరఖాస్తుతో పాటు వారసత్వ ఒప్పంద పత్రం లేదా వీలునామా కాపీ,నిర్దేశించిన తేదీ నుంచి భూమి సర్వే పటం జత చేయాలని,ఈ దరఖాస్తుల పై తహసిల్దార్ 30 రోజుల్లోగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకుంటారని లేకుంటే గడువు తర్వాత ఆటోమేటిక్ గా మ్యూటేషన్ జరుగుతుందని అన్నారు.భూమి హక్కు కలిగిన రైతులందరికీ 300 రూపాయల ఫీజుతో పాస్ బుక్ జారీ చేస్తారని అన్నారు.పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు.పిఓటి,ఎల్.టి.ఆర్,సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ,రిజిస్ట్రేషన్ ఫీజు,100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని,హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని అన్నారు.వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్,మ్యూటేషన్ ఒకే రోజు ఉంటాయని అన్నారు. కొనుగోలు,దానం తనకా బదిలీ బాగా పంపకాల ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేస్తారని,స్లాట్ బుకింగ్,స్టాంప్ డ్యూటీ రిజిస్ట్రేషన్ న్యూట్రిషన్ ఫీజు చెల్లింపు అంటే నిర్ణీత తేదీల్లో చట్ట ప్రకారం సొంత దస్తావేజు రాసుకొని సమర్పించాల్సి ఉంటుందని,దస్తావేజుతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నుంచి భూమి పట్టం సమర్పించాలని అన్నారు. వారసత్వం లేదా వీలు నామా ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసిల్దార్ విచారణ జరిపి హక్కుల రికార్డుల్లో మ్యూటేషన్ చేస్తారని,నిర్ణీత గడువు లోగా పూర్తి చేయకుంటే ఆటోమేటిక్ గా మ్యూటేషన్ జరుగుతుందని అన్నారు.భూ భారతి చట్టం పై అవగాహన కల్పించేలా కర పత్రాలను పంపిణీ చేశామని,ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు .ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య,అంతర్గాం తహసిల్దార్ తూము రవీందర్,రైతులు,వివిధ వర్గాల ప్రజలు ,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య జ్యోతి జిల్లా సమాఖ్య నూతన పాలకవర్గం సభ్యుల నియామకం పూర్తి.

**జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని.**

**పెద్దపల్లి,ఏప్రిల్17(ప్రజాస్వరం):** చైతన్య జ్యోతి జిల్లా సమాఖ్య నూతన పాలకవర్గం సభ్యుల నియామకం పూర్తయిందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని తెలిపారు.గురువారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని ఎన్నికల అధికారిగా,జిల్లా సహకార అధికారి కార్యాలయ సిబ్బంది అనూష పర్యవేక్షకులుగా మండల సమాఖ్యలో నూతన అధ్యక్షులు,చైతన్య జ్యోతి జిల్లా సమాఖ్య సభ్యులు అందరూ కలిసి జిల్లా సమైక్య నూతన పాలకవర్గ సభ్యుల నియామకం చేశారు.జిల్లా సమాఖ్య పాలక వర్గం సభ్యుల నుంచి పదాదికారులు గా పాలకుర్తి మండలం నుంచి ఎస్.స్నేహ అధ్యక్షురాలిగా,ముత్తారం మండలం నుంచి జే.శోభ కార్యదర్శి,పెద్దపల్లి మండలం నుండి జి.స్వప్న కోశాధికారిగా నియమితులయ్యారు.ఈ సమావేశంలో అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జె.రవి కుమార్,డిపిఎం కె.రవి, జిల్లా సమాఖ్య సిబ్బంది అన్ని మండల సమాఖ్య నూతన అధ్యక్షులు పాల్గొన్నారు.



## ఆదివారంపేటలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం.

**రామగిరి,పెద్దపల్లి,ఏప్రిల్17(ప్రజాస్వరం):** రామగిరి మండలం ఆదివారంపేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగిల్విండో చైర్మన్ తో కలిసి గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు.దళారులను నమ్మకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న,ప్యాక్స్ చైర్మన్ అల్లాడి యాదగిరి రావు,వైస్ చైర్మన్ ఏలువాక కొమురయ్య,మాజీ జెడ్పిటిసి మైదం భారతీ వరప్రసాద్,తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమరయ్య గౌడ్,మాజీ ఉప సర్పంచ్ అట్టే తిరుపతిరెడ్డి,మహిళ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అరెల్లి విజయ సాయిల్ గౌడ్,యాదవ్ సంఘం అధ్యక్షుడు కొమ్ము రాజ కొమురయ్య, మాజీ వార్డ్ నెంబర్ ఇల్లందుల సంజీవ్,యూత్ కాంగ్రెస్ నాయకులు గుడిసెల సంతు,కన్నూరి వంశీ హమాలి సంఘం నాయకులు బండ కనకయ్య,అంకుష్,రాజయ్య,శ్రీనివాస్, దుర్గయ్య,కిషన్,సుధాకర్,సంపత్,రవి,రైతులు,గ్రామ ప్రజలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హామీలను విస్మరించింది.

- **కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఏమైంది.**
- **4000 పెన్షన్ మహిళలకు 2500 పథకం ఎటు పోయింది.**
- **గోదావరిఖని ప్రెస్ మీట్లో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్.**

**గోదావరిఖని,పెద్దపల్లి,ఏప్రిల్17(ప్రజాస్వరం):** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమను నటిస్తూ,అమలుకాని హామీలను గుప్పిస్తుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు.పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు,420 వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే హామీలను విస్మరించిందన్నారు.వృద్ధులకు 4వేల రూపాయల పెన్షన్,మహిళలకు 2500 రూపాయలు,కళ్యాణ లక్ష్మి లక్ష రూపాయల తోపాటు తులం బంగారం ఏమయ్యాయని చందర్ ప్రశ్నించారు.రేవంత్ సర్కార్ పిల్లల నుండి వృద్ధుల వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.రామగుండం కార్పొరేషన్ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు డివిజన్ల లో తిరుగుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు.అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓట్లు అడగాలని లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పరాభవం తప్పదని చందర్ హెచ్చరించారు.ఎన్నికల వేళా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజల్లో తిరుగుతూ పథకాల పేరుతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.ఏమాత్రం నైతిక విలువలు ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసిన తర్వాతే ఓట్లు అడగాలని చందర్ డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలు కాంగ్రెస్ పార్టీ కుట్రలు గమనిస్తున్నారని సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని చందర్ ఆశాభావం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు.

- **పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
- **కొనుగోలు అంశంలో సమస్యల పై రైతులు 08728-224045 నెంబర్ కు ఫోన్ చేయాలి.**

**పెద్దపల్లి,ఏప్రిల్17(ప్రజాస్వరం):** పెద్దపల్లి జిల్లాలో యాసంగి పంట ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో షెడ్యూల్ విడుదల చేశారు. పెద్దపల్లి జిల్లాలో యాసంగి పంట ధాన్యం కొనుగోలు పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని,నాణ్యమైన పంటను మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామని,సన్న రకం ధాన్యానికి క్వింటాల్ 500 రూపాయల బోనస్ సైతం అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.జిల్లాలో ఐకెపి,ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు గోనె సంచులు,లారీల ట్రాన్స్పోర్ట్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా 7995050780 ఫోన్ నెంబర్ కు కాల్ చేయాలని కలెక్టర్ తెలిపారు.ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుందని రైతులకు ధాన్యం కొనుగోలు అంశంలో ఎటువంటి ఫిర్యాదులు సమస్యలు ఉన్న వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 08728224045 కు ఫోన్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ఈ నెల 21న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా...

**మెదక్ ఏప్రిల్ 17 (ప్రజా స్వరం)**మెదక్ జిల్లాలోని ఐటిఐ కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా పథకం ద్వారా మెదక్ పట్టణంలో ప్రభుత్వ ఐ.టి.ఐ లో ఈ నెల 21 న అప్రెంటిషిప్ మేళా నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేళా లో పలు కంపెనీలు పాల్గొనన్నున్నాయని అన్నారు. ఐటిఐ కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భూ వివాదాల పరిష్కారం కోసమే భూ భారతి...





**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ ఏప్రిల్ 17 (ప్రజా స్వరం)**తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మక కార్యక్రమం భూభారతి చట్టం 2025 పైనా అవగాహన సదస్సు గురువారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం, రెవిన్యూ అవగాహన సదస్సు లో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరయ్యారు. భూ భారతి, రెవిన్యూ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రెవిన్యూ శాఖ సందేశాన్ని, వక్షువల్ ద్వారా రైతులు వీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా సదస్సుకు హాజరైన రైతులకు, భూ భారతి చట్టం యొక్క విది విధానాలపై తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి రైతులకు భూ లబ్ధిదారులకు సుదీర్ఘంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ భూ భారతి నూతన చట్టం భూ వివాదాల పరిష్కారానికి 'భూ భారతి' దోహదం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంత గానో దోహదపడుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా మనోరాబాద్ మండలం రైతు వేదిక వద్ద భూభారతి నూతన చట్టంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు హితవు పలికారు. అనంతరం భూలబ్ధిదారుల సమస్యలపై సమాధానాల ద్వారా నివృత్తి చేశారు

ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్టీవో జై చంద్ర రెడ్డి, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎండిఓ కృష్ణ మూర్తి, ఈఈ పంచాయతీరాజ్, నరసింహులు, పిఏ.సిఎస్ చైర్మన్ బాల కృష్ణారెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను జయప్రదం చేయాలి..

- **కెసిఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం..**
- **చలో వరంగల్ దండుల బైలెల్లి రావాలి..**



**దౌల్తాబాద్ ఏప్రిల్ 17(ప్రజాస్వరం)** ఈనెల 27న వరంగల్ లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని టిబీఆర్ఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు.దౌల్తాబాద్ మండల మాజీ సర్పంచ్ లఫోరం అధ్యక్షులు సరువుగారి యాదవ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన తిరుమలాపూర్ లో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ గత పది సంవత్సరాలు రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందించి రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ గా గుర్తింపు తెచ్చిన ఘనత కెసిఆర్ కి దక్కిందన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన 16 నెలల పాలనలో ప్రజలు రైతులు హరిగోసపడుతున్నట్లు ఆయన గుర్తు చేశారు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేలపై అక్రమ కేసులు నిర్బంధాలతో టీబీఆర్ఎస్ శ్రేణులను భయపడే విధంగా పాల్పడుతుందని.

- **బీఆర్ఎస్ పార్టీ కి ఉద్యమాలు కొత్తకాదనీ** ఉద్యమాల నుంచి వచ్చిన పార్టీ అని పోరాటాల ప్రజా ఉద్యమాల గడ్డ దుబ్బాక నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వరంగల్ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని ఆ పార్టీ సొంత సర్వేలో మళ్ళీ కేసీఆర్ రావాలని తెలిపోయిందని దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆదరణ కోల్పోయిందన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా ఈనెల 27న వరంగల్ లో జరిగే బి.ఆర్.ఎస్ రజతోత్సవ సభకు కెసిఆర్ హాజరవుతున్నాడని గ్రామ గ్రామాన గులాబీ సైనికులు దండులా బయలుదేరి సభను విజయవంతం చేసి తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ సత్తాను చాటిచెప్పి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పే విధంగా సభను జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

## పోషణ పక్వాడలో తల్లులకు అవగాహన కార్యక్రమం

**ఐసిడిఎస్ సూపర్వైజర్ గిరిజ**

**దౌల్తాబాద్ ఏప్రిల్ 17 (ప్రజాస్వరం )**పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు పోషణ ఆహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ గిరిజ అన్నారు. గురువారం మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో పోషణ పక్వాడలో భాగంగా తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు . ఈ సందర్భంగా ఆమె వారిని ఉద్దేశించి మాట్లాడారు బిడ్డ పుట్టినప్పటినుంచి జీవితకాల వరకు పోషణ ఆహారం తీసుకోవడం ప్రతి ఒక్కరికి అవసరమని సూచించారు. చిరుధాన్యాలతో సమతుల ఆహారం లభిస్తుందని స్పష్టం చేశారు గర్భిణీ స్త్రీలు పోషణ ఆహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తుందని సూచించారు సూపర్ వైజ్ సప్లమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రామ్ యొక్క ప్రోటోకాల్స్ పై అవగాహన కల్పించామన్నారు .అలాగే ఎస్ ఏ ఎం పిల్లలకు ఆకలి పరీక్ష ఏ విధంగా నిర్వహించాలి అనేది తల్లులకు అవగాహన కల్పించమన్నారు. ఊబకాయాన్ని తగ్గించడానికి మరియు తక్కువ బరువు ఉన్న పిల్లలలో ఆరోగ్యమైన జీవనశైలిని పెంపొందించడానికి ఎలాంటి పోషకాహారం తీసు కోవాలి. అని తల్లులకు అవగాహన కల్పించామన్నారు .ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ, నరేష్ అంగన్వాడీ టీచర్స్, పడాల కళ్యాణి అనిత వినోద ఆశలు, తల్లులు తోపాటు తదితరులు పాల్గొన్నారు.




## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**దౌల్తాబాద్, ఏప్రిల్ 17( ప్రజాస్వరం):**మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన వడ్ల ఎల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఉప సర్పంచ్ అందె రాజిరెడ్డి బాధిత కుటుంబాన్ని వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఎల్లవేళలా సహాయం అందించేందుకు ముందుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంపల్లి వినోద్,బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు చిటుకుల స్వామి,కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పంచమి కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పంచమి రామస్వామి, సూరంపల్లి ప్రభాకర్, సూరంపల్లి పర్షరాములు,మిద్దె బాబు, తిప్పగౌని సత్యనారాయణ గౌడ్, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

- **న్యాయవాదుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి**
- **న్యాయవాదిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం**

**ప్రజాస్వరం, కోదాడ:** సూర్యాపేటలో న్యాయవాది కిషోర్ పై జరిగిన దాడిని కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని న్యాయవాదిపై దాడి చేసిన సంబంధిత వ్యక్తులపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకొని మరలా ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నాగుబండి కృష్ణమూర్తి, సుధాకర్ రెడ్డి, ఈదుల కృష్ణయ్య, పాలేటి నాగేశ్వరరావు, అక్కిరాజు యశ్వంత్, షేక్ కరిముల్లా, హుస్సేన్, ధనలక్ష్మి, మురళి, నయీమ్, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల గుండెల్లో ఉన్నది గులాబీ జెండానే

- **ఉద్యమ స్ఫూర్తితో ఓరుగల్లుకు దండై కదులుతాం**
- **భారీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం!**
- **మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపు**

**ప్రజాస్వరం, కోదాడ:** పోయింది అధికారం మాత్రమే.. తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్నది గులాబీ జెండానే అని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. గురువారం కోదాడ మండలంలోని గుడిబండ గ్రామంలో మాజీ ఎంపీపీ చింత కవితా రాధారెడ్డి అధ్యక్షతన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కోసం నిర్వహించిన సన్నాహక సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ఈ నెల 27న వరంగల్ లో జరిగే సభకు కోదాడ నియోజకవర్గం నుండి గులాబీ దండు వేలాదిగా కదం తొక్కాలని వారు పిలుపునిచ్చారు. ఈ సభకు హాజరయ్యే పార్టీ శ్రేణులను చూసి కాంగ్రెసొల్లా గుండెల్లో రైళ్లు పరుగెత్తాలి అని ఆయన అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చె అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఆయన దీమా వ్యక్తం చేశారు. ఉద్యమ స్ఫూర్తితో ఓరుగల్లుకు దండై కదులుదాం..భారీ బహిరంగ సభను విజయవంతం చేద్దాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు, మాజీ సొసైటీ చైర్మన్ ముత్తవరపు రమేష్, మండల పార్టీ నాయకులు శ్రీకాంత్, బ్రహ్మం గౌడ్, శ్రీనివాస్ యాదవ్, అప్పారావు, వెంకట్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

**బీజేవైఎం మండల అధ్యక్షుడు బుర్ర రాజు**

**దౌల్తాబాద్ ఏప్రిల్ 17(ప్రజాస్వరం)** నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని బీజేవైఎం మండల అధ్యక్షుడు బుర్ర రాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల కలకుంట్ల సిద్దిరాంలు కు 10500 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశామన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిది ఎంతో ద్రోధపడుతుందని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్దిగాని చెంద్రం నరేష్ నరేందర్ చెంద్రం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాస్వరం, ధర్మపురి టౌన్:**

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జైన అధ్యక్షులు సౌల్ల నరేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెద్ద నక్కలపెట్, రాజారాం ధమ్మన్నపెట్ లను ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మన్ లు ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మి మద్దతు ధర గ్రేడ్ A 2320 రూపాయలు , సాధారణ రకం 2300 రూపాయలు క్వింటాలుకు పొందాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంఘ నర్సింలు, సహకార సంఘ డైరెక్టర్ లు అన్నపురం తిరుపతి, దండవేణి గంగమల్లయ్య, తాడుకా తిరుపతి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుకర్ రెడ్డి, రాఫిక్, కషెట్టి రాజేష్, గునిషెట్టి అంజయ్య మరియు నాయకులు వేముల రాజేష్, ఒజ్జల లక్ష్మణ్, ఆశెట్టి శ్రీనివాస్ గుడ్ల రవి, రైతులు పాల్గొన్నారు.



## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్

**ప్రజాస్వరం, ఆదిలాబాద్ బ్యూరో:**

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే లింగట్ల గ్రామంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతూ గురువారం ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం లింగట్ల గ్రామంలో కొందరు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తన సిబ్బందితో లింగట్ల గ్రామంలో తనిఖీలు నిర్వహించగ సాబ్లే రంజిత్, సాబ్లే సంజీవ్ అనే వ్యక్తులు గంజాయి తో పట్టుబడ్డారని తెలిపారు. సాబ్లే రంజిత్ వద్ద 184) గ్రాముల పొడి గంజాయి, సాబ్లే సంజీవ్ వద్ద 223 గ్రాముల పొడి గంజాయి లభించిందని, వారిపై



కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించి నట్టు ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా గంజాయి అమ్మిన, కలిగి ఉన్న, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# భూ భారతి ఆర్ ఓ ఆర్ చట్టంతో రెవెన్యూ సమస్యలు సత్వర పరిష్కారం: టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.

**భూ భారతి చట్టంతో రెవెన్యూ వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ : జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**

**కొండాపూర్ ఏప్రిల్ 17 (ప్రజాస్వరం)**భూభారతి తో రైతుల సమస్యలు ఎక్కడికి అక్కడ పరిష్కారం. భూభారతి ఆర్ వో ఆర్ చట్టం 2025 ద్వారా రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. రైతులకు భూభారతి ఆర్వో ఆర్ చట్టం 2025 పై అవగాహన సదస్సును గురువారం కొండాపూర్ మండలానికి సంబంధించిన భూభారతి అవగాహన సదస్సును మల్కాపూర్ శివారులోని గోకుల్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమాలకి టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ముందుగా అవగాహన సదస్సులో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించి ముఖ్యమంత్రి సం దేశాన్ని రెవెన్యూ అధికారులు చదివి వినిపించారు . అనంతరం ముఖ్య అతిథులు గా హాజరైన టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మన ప్రభుత్వం జై జవాన్ జై కిసాన్ నినాదంతో ముందు కెళ్తున్నది అన్నారు మన దేశ రక్షణ కోసం సైనికులు ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు.దేశ ప్రజలకు ఆహార అందించడం కోసం ఎండ, వానలకు లెక్క చేయక రైతులు పాడిపంటలు పండించి మనకు ఆహారాన్ని అందిస్తున్నారని మనదేశ ఆర్థిక ప్రగతి లో రైతుల భాగస్వామ్యం మరువలేనిది అన్నారు. అలాంటి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన లోప భూయిష్టమైన ధరణి వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రైతుల ఇబ్బందులను శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు తీసుకొచ్చి అధికార వికేంద్రీకరణ జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు తెస్తూ ఏప్రిల్ 14వ తేదీన భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టం 20 25 ను అమల్లోకి తీసు కువచ్చింది.అన్నారు. ఈ చట్టం ద్వారా రెవెన్యూ సమస్యలు శాశ్వత పరిష్కారం లభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ భూభారతి 2025 చట్టం ద్వారా రైతుల సమస్యలు ఎక్కడికి అక్కడ పరిష్కారమయ్యే లా ప్రభుత్వం అవకాశం కల్పించింది అన్నారు. గతంలో రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ కు, సిసిఎల్ఏ కు వెళ్లేవారు. కానీ నూతన చట్టంలో ఎక్కడికక్కడ సమస్య పరిష్కరించేలా నూతన చట్టం రూపొందించినట్లు తెలిపారు.ఎక్కడైనా తప్పు జరిగితే కోర్టుకు వెళ్లి సమయం వృధా చేసుకోకుండా పై అధికారులకు అప్పీలు చేసుకునే అవకాశం రైతులకు నూతన చట్టం ద్వారా కలిగిందన్నారు. భూ పరిపాలనలో ఈ నూతన ఆర్ఓఆర్ చట్టం వల్ల అనేక మార్పులు వచ్చాయన్నారు. ముఖ్యంగా రెవెన్యూ వ్యవస్థలో అధికార వికేంద్రీకరణకు నూతన చట్టందోహదపడు తుందన్నారు. ఒక రిజిస్ట్రేషన్ లేదా పౌతీ చేయాలంటే సంబంధిత అర్జీదారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు సర్వే మ్యాప్ గ్రామస్థాయిలో విచారణ లాంటి కార్యక్రమాలు భూభారతిలో ఉండడం వల్ల తప్పులు జరిగే అవకాశం తగ్గిందన్నారు. దీంతో భూ పరిపాలనలో పారదర్శకత ఏర్పడుతుందన్నారు. ఈ నూతన చట్టం వల్ల సాదా బైనామాల సమస్య పరిష్కరించ వచ్చన్నారు. ఏప్రిల్ 2014 ముందు ఉన్న సాదా బైనామాలను రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గ్రామస్థాయిలో విచారణ జరిపి పరిష్కరించే వెసులుబాటు నూతన ఆర్ఓఆర్ చట్టం వల్ల ఏర్పడిం దన్నారు.ఈ చట్టంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం కోసం ప్రభుత్వం అన్ని మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా రెవిన్యూ అధికారులు భూభారతి చట్టం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను భూభారతి చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మాధురి, పౌరసరఫల శాఖ జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ సంగారెడ్డి ఆర్డిఓ రవీందర్ రెడ్డి, సి డి సి చైర్మన్ రామ్ రెడ్డి, ఆత్మ చైర్మన్ ప్రభు మార్కెటింగ్ చైర్మన్ కుమార్, కొండాపూర్ తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో శ్రీనివాస్ కొండాపూర్ మాజీ ఎంపిటిసి నరసింహారెడ్డి, గొల్లపల్లి సొసైటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాణిక్య రెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశం గౌడ్, మండల రెవెన్యూ అధికారులు, పి ఎ సి ఎస్ చైర్మన్ లు, వ్యవసాయ అధికారులు రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# పెద్దపల్లి రాజీవ్ రహదారిపై బస్సు లారీ ఢీ

- డ్రైవర్ తో పాటు 25 మందికి తీవ్ర గాయాలు.
- ఐదుగురి పరిస్థితి విషమం.
- ఆస్పత్రికి తరలింపు.



**పెద్దపల్లి బ్యూరో,ఏప్రిల్17(ప్రజాస్వరం):**పెద్దపల్లి జిల్లా రాజీవ్ రహదారిపై వస్తున్న బస్సు లారీ ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 25 మందికి తీవ్రగాయాలయ్యాయి.ఈ సంఘటన పెద్దపల్లి మండలం అందుగులపల్లి ,అప్పన్నపేట గ్రామాల మధ్య చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం రాజీవ్ రహదారిపై పెద్దపల్లి మండలం అందుగులపల్లి,అప్పన్నపేట గ్రామాల మధ్య మరమ్మతుల పనులు జరుగుతుండగా రోడ్డును వన్ వే చేశారు.దీంతో ఎదురెదురుగా వస్తున్న గోదావరిఖనికి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పెద్దపల్లి వైపుకు వస్తుండగా పెద్దపల్లి వైపు నుంచి కరీంనగర్ వైపుకు మట్టి లోడ్ తో తరలి వెళ్తున్న లారీ రెండూ ఢీకొన్నాయి. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 50 మందిలో డ్రైవర్‌తోపాటు 25 మంది ప్రయాణికులు తీవ్ర గాయాల పాలయ్యారు.వీరిలో ఐదుగురు పరిస్థితి విషమంగా ఉండగా మరి కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి.అలాగే లారీ డ్రైవర్,క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి.కాగా క్షతగాత్రులను 108 వాహనంతో పాటు పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని జిల్లా ఆసుపత్రికి హుటాహుటిన తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.


# అన్నప్రాసన, పుట్టు వెంట్రుకలుతీయు కార్యక్రమాల్లో పాల్గొన్న డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్

**ఖమ్మం,ఏప్రిల్ 17 (ప్రజాస్వరం):కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తురక రవి- శృతి దంపతుల కుమారుడు చి. జస్వంత్ నరసింహ కు పుట్టు వెంట్రుకలు తీసి, అన్నప్రాసన మరియు కూతురు చి. సాత్విక శ్రీ కు చెవులు కుట్టించుట వేడుకలు స్థానిక ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకలమల్లిబాబు యాదవ్ పాల్గొని చిరంజీవులను ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బానోత్ నరసింహ.నాయక్,మేకపోతుల మహేష్,చల్ల మల్లయ్య, బండి లక్ష్మినర్సు,బోడేపూడి రాజా,తమ్మిశెట్టి రవి,తురక నవీన్,చల్ల రామక్రిష్ణ,చిలమర్తి ఉపేందర్,తురక నాగేంద్రబాబు,మంజల చిరంజీవి,చల్ల రాంబాబు,నరేష్ మరియు బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.**



# జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి

**వలిగొండ,ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల కేంద్రంలోని శివ సాయి ఫంక్షన్ హాల్ లో ఎస్ ఆర్ డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ అధినేత పుప్పాల తేజ శ్రీకాంత్ పుత్రిక చిరంజీవిలు గీత శ్రీ నిషిక మొదటి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గురువారం రోజున భువనగిరి మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి చిన్నారులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బోనగిరి మండల అధ్యక్షులు జనగాం పాండు, భువనగిరి పట్టణ కార్యదర్శి రచ్చ శ్రీనివాస్,జిల్లా యువ నాయకులు డాక్టర్ రేకుల శ్రీనివాస్,అబ్బగాని వెంకటేష్,పెంట నితీష్,మెరుగు సురేష్,పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# బ్రహ్మోత్సవాలకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు

**శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు**


**జమ్మికుంట,ఏప్రిల్ 17 (ప్రజాస్వరం):**శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఇల్లందకుంట కరీంనగర్ జిల్లా అపర భద్రాద్రిగా పిలిచే ఈ క్షేత్రంలో 2025 సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాల ఏప్రిల్ 4వ తేదీ నుండి 16వ తేదీ వరకు అంటే 13 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది .ఈ 13 రోజులు కార్యక్రమాల్లో వేల మంది భక్తులు స్వామివార్లను దర్శించుకుని స్వామి వారి కృపకు పాత్రులు కావడం సంతోషం.ఈ 13 రోజులు ఉత్సవాల్లో భాగంగా కళ్యాణం పెద్ద వ్రతం రోజు కలుపుకొని సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారి దర్శనానికి హాజరు కావడం జరిగింది.భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ శాఖ ధర్మకర్తల మండలి తరపున అన్ని ఏర్పాట్లు చేసాం.ధర్మకర్తల మండలి దేవస్థాన అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాము.మాకు సహకరించిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అన్నదానం ఏర్పాటుచేశారుకార్యనిర్వాహణాధికారి,ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది,వారికి వివిధ ప్రభుత్వ శాఖలు పోలీస్ ,రెవెన్యూ, మున్సిపల్ ,హెల్త్ డిపార్ట్మెంట్, ఆర్ డబ్ల్యు ఎస్ ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, పారిశుద్ధ కార్మికులు విద్యుత్ శాఖ మంచినీరు సప్లై, ఫైర్ సిబ్బంది, మజ్జిగ పంపిణీ చేసిన వారు, సేవా సమితి మహిళలకు, ప్రతి ప్రభుత్వ విభాగాల వారు తమ యొక్క సిబ్బందితో భక్తులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ఉత్సవాలను విజయవంతం కావడానికి ప్రత్యేకంగా సహకరించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు మండల ప్రజలకు దేవస్థానం యొక్క అధికారుల సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కృప ఉండాలని ఈ యొక్క కార్యక్రమాన్ని ఇంత విజయవంతం చేసిన భగవత్ భక్తులకు మా ధర్మకర్తల మండలికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని దేవస్థానం చైర్మన్ రామారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు పరమేశ్వర్,రవికిరణ్,గోపాల్.రెడ్డి,మలేష్,కిషన్.రెడ్డి,లావణ్యశ్రీనివాస్,చిరంజీవి, రామ్ రెడ్డి,నాగరాజు,మధుకర్ రెడ్డి,నారాయణరెడ్డి ,రాజేందర్,తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# దురాజ్ పల్లిలోని హంగ్రీ బర్డ్స హోటల్లో ఈగల బిర్యాని

**హోటల్ యాజమాన్యానికి రూ 5 వేలు పెనాల్టీ**

**చివ్వేంల,ఏప్రిల్ 17(ప్రజాస్వరం):**దురాజ్ పల్లి లో నూతనంగా ఏర్పాటుచేసిన హంగ్రీ బర్డ్స్ హోటల్ లో కొందరు వ్యక్తులు భోజనం చేయడానికి వెళ్ళి బిర్యానీ ఆర్డర్ ఇవ్వగా, బిర్యానీలో ఈగలతో వండిన పదార్థాలను కస్టమర్లకు అందించారు.ఇదేంటని అడిగిన కస్టమర్లపై హోటల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు.ఇదే విషయమై జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కు మరియు మున్సిపాల్టీ వారికీ కస్టమర్లు ఫిర్యాదు చేశారు.కస్టమర్ల ఫిర్యాదు మేరకు మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ మరియు మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో సంబంధిత హోటల్ ను తనిఖీ చేసి హోటల్ యాజమాన్యానికి రూ 5 వేలు పెనాల్టీ వెయిట జరిగింది.ఈ కార్యక్రమంలో హెల్త్ అస్సిటెంట్ మస్కాపురం సురేష్,ఎన్విరాన్ మెంట్ ఇంజనీర్ సిఎచ్ .శివ ప్రసాద్, జూనియర్ అస్సిటెంట్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.







# క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి.

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.
- ప్రమాదంలో గాయపడ్డ వారిని పరామర్శించిన ఎమ్మెల్యే.

**పెద్దపల్లి బ్యూరో,ఏప్రిల్17(ప్రజాస్వరం):**పెద్దపల్లి మండలం అప్పన్నపేట వద్ద జరిగిన బస్సు ప్రమాదం లో గాయపడ్డ 29 మంది క్షతగాత్రులను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రభుత్వ ఆసుపత్రి కి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు.క్షతగాత్రులకు మనోధైర్యాన్ని అందించి ప్రమాద సంఘటన వివరాలను పోలీస్,ఆర్టీసీ వారిని అడిగి తెలుసుకొని అనంతరం క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు.ఎమ్మెల్యే వెంట ప్రభుత్వ ఆసుపత్రి సుపరిడిండెంట్ శ్రీధర్,ఆర్టీసీ ఆర్ఏం,పెద్దపల్లి ఎ.సి.పి గజ్జి కృష్ణా,సి.ఐ ప్రవీణ్,వైద్యులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు మరియు తదితరులు ఉన్నారు.



# రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులందరికీ రుణాలు మంజూరు చేయాలి.

**ముత్తారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి డిమాండ్.**

**ముత్తారం,పెద్దపల్లి,ఏప్రిల్17(ప్రజాస్వరం):**ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లబ్ధిదారులందరికి రుణాలు మంజూరు చేయాలని ముత్తారం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు సమయం ఉందా లేదా అనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరాడు.అప్లై చేసుకున్నవారికి సిబిల్ స్కోరు ఉంటేనే ఋణాలు మంజూరు చేస్తామని బ్యాంక్ వారు చేప్పడం లబ్ధిదారులను మభ్యపెట్టడమేనని కిషన్ రెడ్డి ఆరోపించాడు.సిబిల్ స్కోరుతో సంబంధం లేకుండా అర్హులైన వారందరికీ బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని అన్నారు.అర్హులైన పేదవారందరికీ ఈ పథకం ద్వారా లబ్ది చేకూరేల ఉండాలని ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చూడాలని ప్రభుత్వానికి సూచించారు.



# చిట్టెంపాడులో వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తహసిల్దార్ దేవాసింగ్

**నాంపల్లి,ఏప్రిల్ 17 (ప్రజాస్వరం):**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ దేవా సింగ్ అన్నారు. గురువారం మండలంలోని చిట్టెంపాట్,గట్ల మల్లేపల్లి గ్రామాలలో పెట్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అనుబంధంగా ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి రైతులు ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్చార్జి పూదరి పురుషోత్తం , సీఈవో మాధవరెడ్డి,డైరెక్టర్లు గొల్ల బోయిన వెంకటయ్య,రెడ్డి మల్ల రాములు,సిల్వర్ చంద్రశేఖర్,నల్లగాసు లింగస్వామి,చిరుమావుల్ల గిరిబాబు,రైతులు తదితరులు పాల్గొన్నారు.





# 'సారంగపాణి జాతకం' ట్రైలర్ లాంచ్

తెలుగు సినిమా ప్రపంచంలో వినూత్న కథలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇంద్రగంటి మోహనకృష్ణ ఈసారి క్రైమ్‌కామెడీ షేడ్స్‌లో మేళవించిన నూతన కథనంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ప్రియదర్శి – రూపా కొడవాయూర్ జంటగానటించిన చిత్రం 'సారంగపాణి జాతకం', ఈ నెల ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.హైదరాబాద్‌లో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్ వేదికగా చిత్ర బృందం పాల్గొని సినిమాపై భారీ అంచనాలు పెంచేలా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రియదర్శి, హీరోయిన్ రూపా, వెన్నెల కిషోర్, వైవా హర్ష, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తదితరులు హాజరయ్యారు.వెన్నెల కిషోర్ మాట్లాడుతూ.. "పుష్పక విమానం టాకీగా వస్తే ఎలా ఉంటుందో, ఈ చిత్రం కూడా అలాగే వినూత్నంగా ఉంటుంది. పూర్తిగా వినోదాన్ని పంచే చిత్రం ఇది. తప్పకుండా థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయండి" అని అన్నారు. అనతంతరం హీరో ప్రియదర్శి మాట్లాడుతూ.. "ఈ చిత్రానికి పని చేయడం గర్వంగా ఉంది. ఇంద్రగంటి గారితో పని చేయడం నా కల. ఈ వేసవిలో చల్లని అనుభూతిని అందించే వినోదాత్మక చిత్రం ఇది" అని తెలిపారు.

# చీరలో ఆకర్షిస్తున్న సాయి మంజ్రేకర్

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టీవ్ గా ఉండే సాయి మంజ్రేకర్ తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు లేత పూల సారీ ధరించి అందరినీ ప్రేమలో ఆకర్షిస్తుంది. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో సాయి మంజ్రేకర్ ఒక సాఫ్ట్ గ్రీన్, పింక్ ఫ్లోరల్ సారీలో మెరిసింది. సారీ నాజూకు పదార్థంతో తయారై, ఆధునిక డ్రేప్ స్టైల్‌లో ఉంది. ఆమె దానిని పింక్ అలంకరించిన బ్లౌజ్‌తో జత చేసింది. ఆమె క్యాప్షన్ చాలా సాధారణంగా, కళ్ల ఎమోజీలతో ఉంది. బాగుందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. సాయి మంజ్రేకర్ ఒక సినిమా కుటుంబంలో జన్మించిన విషయం తెలిసిందే. ఆమె తండ్రి మహేష్ మంజ్రేకర్ నటుడు, దర్శకుడు, నిర్మాత. ఆమె తల్లి మేధా మంజ్రేకర్ కూడా నటి, నిర్మాత. సినిమాల మధ్య పెరిగిన సాయి, నటనను తన కెరీర్‌గా ఎంచుకోవడంలో ఇది దోహదపడింది. శ్రీనివాస్ ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం అర్జున్ సన్ ఆఫ్ విజయంతి అనే తెలుగు యాక్షన్ థ్రిల్లర్ సినిమాలో సాయి మంజ్రేకర్ కనిపించనుంది. ముఖ్య పాత్రల్లో కల్యాణ్ రామ్, విజయశాంతి మరియు సాయి మంజ్రేకర్ ఉన్నారు.



# ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే

హీరోయిన్ పూజా హెగ్డే టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన విషయం తెలిసిందే. కానీ, ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేకపోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన ఈమెకు ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్సే లేవు. పూజా తెలుగులో సినిమా చేయక దాదాపుగా మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచిన విషయం తెలిసిందే. పూజా నటించిన అరవిందసమేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది.అయితే, టాలీవుడ్‌లో ఎప్పుడు సినిమా చేయబోతున్నారన్న ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చింది. 'అల వైకుంఠపురములో సినిమాలో చెప్పినట్లుగా నేను గ్యాప్ తీసుకోలేదు.. వచ్చింది. నేను ఏదైనా డిఫరెంట్ గా, కొత్తగా చేయాలని అనుకుంటున్నా. చాలా కథలు విన్నాను కానీ.. ఇప్పటివరకూ నాకు ఏదీ అంతగా కనెక్ట్ కాలేదు. ఈసారి నేను చేసే సినిమా ఖచ్చితంగా బాగుండాలని, మరింతగా వైవిధ్యంగా ఉండాలని అనుకుంటున్నాను' అని పేర్కొంది. అయితే త్వరలో పూజా ప్రేమ కథా చిత్రంతో తెలుగు ప్రేక్షకులని పలకరించనుందని అంటున్నారు.



## సేతుపతి సినిమాలో
# రాధికా ఆప్టే

ప్రముఖ డైరెక్టర్ పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం విధితమే. పూరి సేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' అనే బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి మరో కథానాయిక పేరు వినిపిస్తుంది. ఈ మూవీలో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే రాధికా విజయ్‌కి జోడిగా నటిస్తుందా లేదా విలన్ పాత్రలో నటిస్తుందా అనేది అఫీషియల్ గా తెలియాల్సి ఉంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999